క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ట్రాక్టర్ యూనియన్ సభ్యులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరి నుంచి లోకల్ ట్రాక్టర్లకు వెసులుబాటుగా ఇసుక తీసుకురావడానికి అనుమతి ఇవ్వాలని కలెక్టర్ రాహుల్‌శర్మను ట్రాక్టర్ యూనియన్ సంఘం సభ్యులు గురువారం కాళేశ్వరంలో కలిశారు. కాగా టీజీఎండీసీ ద్వారా అనుమతి తీసుకొని ఇసుక రవాణా చేయాలని కలెక్టర్ తెలిపారు. మరోమారు అడుగగా సమీపంలోని ఇసుక క్వారీ నుంచి అనుమతితో రసీదు తీసుకొని ఇసుక తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నట్లు తెలిసింది.

కవయిత్రి మొల్లా జయంతి



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ఐబీ విశ్రాంతి భవనంలో కవయిత్రి మొల్లా జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. శాలివాహనసంఘం రాష్ట్ర నాయకుడు సముద్రాల తిరుపతి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలు వేశారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి, రామారావు, ప్రవీణ్, సందీప్, రాజశేఖర్,నాగరాజు, ఏతఈ రవి, రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన గుర్రం సుష్రుత్ గతంలో పరకాల నుంచి చిట్యాలకు ఆర్టీసీ బస్సులో వస్తుండగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి ఏఎస్సై సమ్మిరెడ్డి చేతుల మీదుగా గురువారం అందజేశారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ములుగు: రైతుల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాగులో ఉన్న రైతుల చివరి పంట పొలాలకు నీటిని అందించేందు మంత్రి సీతక్క చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రామప్ప–లక్నవరం గ్రావిటీ కెనాల్ పనులు పూర్తి చేసి ఇంచర్ల, కాశిందేవిపేట, జంగాలపల్లి రైతులకు న్యాయం జరిగే విధంగా భూసేకరణ చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారని వివరించారు. భూ సేకరణకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ములుగు మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల రేవంత్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అభినయ్‌చారి, అబ్బాపురం భిక్షపతి పాల్గొన్నారు.

ఆలయంలో తిరు కల్యాణానికి ఏర్పాట్లు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు(శుక్రవారం) నిర్వహించనున్న తిరు కల్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. తిరు కల్యాణ మహోత్సవ వేడుకలను తిలకించేందకు వెంకటాపురం, వాజేడు మండలాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, భద్రాది కొత్తగూడెం జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కల్యాణ వేడుకలను తిలకిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చలువ పందిల్లు, విద్యుత్ లైట్లు, తాగు నీటి సౌకర్యం కల్పించారు.

ముగిసిన జాజిరి ఆట

ఏటూరునాగారం: మండలంలోని ప్రజలు హోళీ పండుగ సందర్భంగా ఆడుతున్న జాజిరి ఆట గురువారం ముగిసింది. మహిళలు, చిన్న పెద్ద తేడా లేకుండా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, పల్లె పాటలను పాడుతూ అలరించారు. మర్వాడి సంఘం, రామాలయం ఆధ్వర్యంలో కాముడి దహనం కార్యక్రమాన్ని రామాలయం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేశారు. శాస్త్రోక్తంగా పూజలు చేసి కాముడి దహనం చేసి రంగులు చల్లుకున్నారు. శుక్రవారం నిర్వహించే హోళీ వేడుకలకు ప్రజలు, యువకులు సిద్ధమయ్యారు.

జోరుగా 'ఉపాధి' పనులు

● పనులకు వెళ్లేందుకు కూలీల ఆసక్తి



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

మల్హర్: ప్రజలకు అన్ని కాలాల్లో ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రస్తుతం మండలంలో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. వ్యవసాయ పనులు పెద్దగా లేకపోవడంతో పనులకు వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూపుతున్నారు. ఉన్నతాధికారులు గ్రామల వారీగా లక్ష్యాన్ని విధించడంతో పని చేసి వారి సంఖ్య పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి గ్రామ పంచాయతీలో100 మంది కూలీలు వచ్చేలా లక్ష్యం విధించగా సగటున 55 మంది వస్తున్నారు. కొద్దిరోజులగా ఉపాధి హామీ పనులకు కూలీలు సంఖ్య పెంచడానికి ఉపాధిహామీ ఏపీఓ హరీశ్, టీఏలు నిత్యం గ్రామాల్లోకి వెళ్లి జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ పనులకు రావాలని అవగాహన కల్పించారు. దీంతో రోజురోజుకూ కూలీల సంఖ్య పెరుగుతోంది.

మండలంలో ఇలా..

మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 22 గ్రామాల్లో 8492 జాబ్ కార్డులు ఉండగా ఇందులో యాక్టీవ్ జాబ్ కార్డులు 5838 ఉన్నాయి. మొత్తం 18903 కూలీలు ఉండగా 15 రోజులుగా రోజుకు 690 మంది కూలీలు ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నారని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో కూలీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఎండ తీవ్రత కారణంగా ప్రతీ రోజు ఉదయం ఆరు గంటల నుంచి 11 గంటల వరకు కూలీలు పనులుకు వెళ్తున్నారు.

వేసవిలో ఉపాధి పనులే ఆసరా..



వేసవిలో ఉపాధి పనులే మాకు ఆసరాగా నిలుస్తున్నాయి. ప్రతి సీజన్‌లో వంద రోజులకు వెళ్తున్నాం. ఊర్లోనే మూడు నెలల పాటు మాకు చేతినిండా పని దొరుకుతుంది.

– ఎండీ ఇబ్రహీం, తాడిచర్ల

ఉపాధి లభిస్తోంది..



వేసవిలో ఎక్కువగా ఎలాంటి పనులు ఉండవు. ఉపాధిహామీ పనులు ప్రారంభం కాగానే కూలీకి వెళ్తుంటాం. దీంతో మాకు ఉపాధి లభిస్తోంది. మా ఇంట్లో నేను, నా భార్య ఇద్దరం కలిసి పనులకు వెళ్తున్నాం.

– ఇందారం దుర్గయ్య, తాడిచర్ల

సద్వినియోగం చేసుకోవాలి



జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం మండలంలో 690 పైచిలుకు మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు. రానున్న రోజుల్లో కూలీల సంఖ్య మరింత పెంచేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటాం.

– గిరి హరీశ్, ఏపీఓ, మల్హర్

అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగి ఉండాలి

● జిల్లా ఇన్‌చార్జ్ విద్యాధికారి రాజేందర్



బహుమతులు అందజేస్తున్న డీఈఓ రాజేందర్

భూపాలపల్లి అర్బన్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగి ఉండాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాధికారి రాజేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం నెహ్రూ యువకేంద్రం మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్ కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులతో పాటుగా యువతలో ఉన్న పలు రకాల నైపుణ్యాలు వెలికితీసే వేదికగా నెహ్రూ యువకేంద్రం మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్ నిలిచిందన్నారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమాధికారి మల్లీశ్వరి, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్, జిల్లా కళాశాల ప్రిన్సిపల్ హరికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై ఐక్యంగా పోరాడాలి



ఎస్పీ డాక్టర్ శబరీశ్‌తో షేక్‌గౌడ్, సభ్యులు

ములుగు: జిల్లాలో నూతనంగా నియామకమైన అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్(ఐహెచ్‌ఆర్సీ) కమిటీ సభ్యులు ఐక్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని సౌత్ ఇండియా అధ్యక్షుడు షేక్‌గౌస్ సూచించారు. జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న సమక్షంలో గురువారం ఎస్పీ డాక్టర్ శబరీశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నిబంధనలకు లోబడి పనిచేయాలని ఎస్పీ సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వెంకన్నతో పాటు కమిటీ సభ్యులకు షేక్‌గౌడ్ ఐడీ కార్డులను అందించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే రాష్ట్ర కమిటీ తెలియజేయాలని అన్నారు. లీగల్ అడ్వైజర్ల సలహా మేరకు ముందుకుసాగాలని అన్నారు. సాధ్యమైనంత వరకు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధిత కుటుంబాలకు అండగా నిలిచే ప్రయత్నం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భూక్య సునీల్, జిల్లా కార్యదర్శులు కుదురుపాక రాజేష్, బానోత్ జవహర్‌లాల్, సహాయ కార్యదర్శి కెత్తె ఆనంద్(నందు), ఉపాధ్యక్షుడు కంచర్ల రాజు, జానుపట్ల జయరాజ్, కో కన్వీనర్ రుద్రబోయిన మల్లేష్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంజీవ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అశోక్

మంగపేట: మండలంలో అన్ని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచించారు. మండల కేంద్రంలో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్యతో కలిసి గురువారం ప్రారంభించి మాట్లాడారు. వేసవి కాలంలో మండుతున్న ఎండల కారణంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పార్టీ నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, నాయకులు యానయ్య, వెంకటేశ్వర్లు, నరెందర్, నాగేంద్రబాబు, వైకుంఠం, నర్సయ్యగౌడ్, యాదగిరి, మల్లయ్య, సాంబిరెడ్డి, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే ఊరుకోం..

● కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తిరుపతి

ములుగు: దళితబంధు విషయంలో ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మట్టెవాడ తిరుపతి హెచ్చరించారు. బుధవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకాన్ని ఆసరాగా చేసుకొని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. దళితబంధుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంబేడ్కర్ అభయహస్తం పథకం అమలుపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ముమ్మాటికీ దళితుల పక్షాన నిలబడి ఉందనే విషయాన్ని ఎస్సీ సమాజికవర్గ ప్రజలు గమనించాలని సూచించారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జన్ను రవిమాదిగ, మాదారపు రాజు, కొమురయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసీలకే అధికశాతం కేటాయించాలి

వెంకటాపురం(కె): ఏజెన్సీలో ఇందిరమ్మ ఇళ్లను అధిక శాతం ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు తాటి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ఆలుబాక గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1970 తర్వత వలస వచ్చిన గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరును నిలుపుదల చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీల పేరుతో ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ఆదివాసీలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోడి గోపి, బోగ్గుల రాంబాబు, తాటి సుమన్ తదితరులు ఉన్నారు.

స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలి

మల్హర్: శాసనసభలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అవమానించేలా మాట్లాడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి స్పీకర్‌కు బేషరుతుగా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేశ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన ఏర్పడి ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. దీంతో జీర్ణించుకోలేని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి నిండు అసెంబ్లీలో సభాపతిని కుల, డబ్బు దురహంకారంతో అవమానించేలా మాట్లాడం దారుణామని విమర్శించారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

భవన నిర్మాణానికి మార్కింగ్



మార్కింగ్ వేయిస్తున్న అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహించే సరస్వతి పుష్కరాల అభివృద్ధి పనుల్లో భాగంగా గురువారం ప్రసాద కౌంటర్ల భవన నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారు. ఈఈ మహేష్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

పందులతో పంటలకు నష్టం



వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

కాటారం: మండలంలోని దామెరకుంటలో ఊర పందుల స్వైర్య విహారంతో పంటలు నష్టపోతున్నామని గ్రామానికి చెందిన పలువురు గురువారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. పందులు ఊర్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం చేయడంతో పాటు సమీపంలోని పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయని ఆరోపించారు. పందుల అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మహేందర్, రాజ్‌కుమార్, భిక్షపతి, రాజేందర్, లింగయ్య, తదితరులు ఉన్నారు.

వినతిపత్రం అందజేత

చిట్యాల: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్స్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ మండల శాఖ నగర కార్యదర్శి బుర్ర అభిజ్ఞ కోరారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని తహసీల్దార్ హేమకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వెల్పుల రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



ములుగు రూరల్: మండలంలోని కొత్తూరు దేవునిగుట్టపై గురువారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. కొత్తూరు, రాయినిగూడెం, సర్వాపురం, అంకన్నగూడెం, కన్నాయిగూడెం, కాశిందేవిపేట, పంచోత్కులపల్లి, కాశిందేవిపేట, జంగాలపల్లి, దుబ్బగూడెం, జగ్గన్నగూడెం వంటి గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పురోహితుడి రఘునందనాచార్యుల వేదమంత్రాల ఉచ్చరణలతో కల్యాణ మహోత్సవం కనులవిందుగా జరిపించారు. ఆలయ అభివృద్ధికి వీరంనేని రవీందర్‌రావు రూ.లక్షను విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరమనేని కిషన్‌రావు, వీరమనేని రవీందర్‌రావు, అక్కల సంపత్, అప్పని రాంబాబు ఉన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు



దీక్షలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణ చేపట్టే వరకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు ఆపాలని కోరుతూ.. ఎమ్మార్పీఎస్ జిల్లా అంబాల చంద్రమౌళి మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరసన దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. నాయకులు శ్రీనివాస్, సురేష్, రాజేందర్, అశోక్, కిరణ్, తిరుపతి పాల్గొన్నారు.

టేకుమట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ చేపట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రేనుకుంట్ల శంకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన నిరసన దీక్ష గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా మాట ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ఆలస్యం చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీకాంత్, అనిల్, రాం రాంచందర్, రాజాశంకర్, రవి, సరోత్తం, పైడి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలపై వివక్ష చూపడం సరికాదు

పలిమెల: మాదిగలపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చెన్నూరి నీలేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా నీలేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వర్గీకరణ బిల్లును ఆమోదింప చేసిన తర్వాతనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో నాయకులు మహేష్, శ్రీనాథ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు హోలీ వేడుకలు



హోలీ వేడుకల్లో విద్యార్థులు

రేగొండ: మండల కేంద్రంలోని వాణి విద్యానికేతన్ పాఠశాలలో ముందస్తు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు సర్వు రజిత్ కుమార్ హోలీ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, రవీందర్, శ్రీనివాస్, సుమన్, దేవేందర్, ఐలయ్య, ఓంకార్‌రెడ్డి, మాలత, శశాంక, అబేదా, శిరోమణి, ఉజ్వల, విద్యార్థులు పాల్గొన్నారు.

హోలీని ప్రశాంతంగా జరుపుకోవాలి

భూపాలపల్లి అర్బన్: ప్రజలందరూ ఆనందోత్సవాల మధ్య ప్రశాంతంగా హోలీ వేడుకలు నిర్వహించుకోవాలని స్థానిక సీఐ నరేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సహజ సిద్ధమైన రంగులు చల్లుకోవాలని విషపూరిత కెమికల్స్‌తో తయారైన రంగులను వాడి ఆరోగ్యాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగొద్దని, అతివేగంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని, చెరువులు కుంటలు వాగుల వద్దకు స్నానాలకు వెళ్లొద్దని అన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



రేగొండ: ఉపాధ్యాయులతో విద్యార్థులు



మహదేవపూర్ మండలం సూరారంలో..

రేగొండ: కొత్తపల్లిగోరి మండలం కేంద్రంలోని చైతన్య భారతి విద్యాలయంలో స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా హర్షవర్ధిని, ప్రధానోపాధ్యాయుడిగా రాజుకుమార్ వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు సౌమ్య, స్వామి, నవీన్, మౌనిక పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం సూరారంలోని ఎస్ఎస్‌వీఎం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సుభాష్, హెచ్‌ఎం శ్రీలతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీఓ వీరస్వామి

కాటారం: ఎల్‌ఆర్‌ఎస్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ పిల్లి వీరస్వామి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ఎల్‌ఆర్‌ఎస్ స్కీంలో భాగంగా ప్రస్తుతం ఉన్న రాయితీల గూర్చి వివరించారు. మార్చి 31లోగా దరఖాస్తుదారులు ఫీజు చెల్లిస్తే రాయితీ ఉంటుందని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్ లబ్ధిదారులకు పథకాలు వర్తిస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సునీల్, పంచాయతీ కార్యదర్శి షగీర్ ఖాన్, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఐటీడీఏ పీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలకేంద్రానికి గురువారం వచ్చిన ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రను ఆదివాసీ సంఘాల నాయకులు కలిసి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. మండలంలో పూర్తిస్థాయిలో డీటీడీఓ, ఏటీడీఓ, సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు గుర్సింగ బాపు, తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, కిరణ్ కుమార్, మట్టి కృష్ణ, గొట్టం భూమయ్య ,మడె కుమార్, రాంనేని అశోక్, రాజబాబు, రాములు, నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.